సమాజ సేవలో 'టీం సేవియర్స్'

దేశానికి సైనికులు ఎంత అవసరమో సమాజానికి యువతీయువకులు అంతే అవసరం. సమాజానికి పట్టుగొమ్మలాంటి వారిలో కొందరు వ్యసనాల విష వలయంలో చిక్కుకుని జీవితాలను నాశనం చేసుకుంటుంటే మరికొందరు సరదాలతో కాలక్షేపం చేస్తూ కాలాన్ని వృథా చేస్తుంటారు. వారికి భిన్నంగా కొందరు యువతీ యువకులు సమాజ సేవలో పాలు పంచుకుంటూ ఆనందాన్ని పొందుతుంటారు. అలాంటి వారే కావలికి చెందిన 'టీం సేవియర్స్' సభ్యులు. సమాజ సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న వారిపై ప్రత్యేక కథనం.

కావలి: పట్టణానికి చెందిన నల్లిపోగు ప్రణీత్ బీటెక్ ప్రథమ సంవత్సరంలో చేరగానే ఏమైనా సమాజ సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆలోచన వచ్చింది. దానిని ఆచరణలో పెట్టడానికి సాధారణ కానిస్టేబుల్ ప్రభాకర్ కుమారుడినైన తనకు బలం, బలగం లేదని భావించి వెనక్కుతగ్గాడు. అలా మొదటి సంవత్సరం ముగిసి, రెండో సంవత్సరంలోకి వచ్చాడు. తన ఆలోచనలను స్నేహితులతో పంచుకోగా అనుసరించడానికి మరో ఇద్దరు ఆసక్తి కనబరిచారు. దీంతో 'టీం సేవియర్స్' అనే వలంటరీ ఆర్గనైజేషన్‌ను 15 ఆగస్టు 2018లో ఏర్పాటు చేశాడు. అనంతరం మరో వంద మంది జత అయ్యారు. ఇప్పటి వరకు 500కు పైగా సేవా కార్యక్రమాలు చేపట్టారు. ప్రణీత్ బీటెక్‌ను 2021 పూర్తి చేసి ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అయినా సేవా కార్యక్రమాలను యధాతదంగా కొనసాగిస్తూనే ఉన్నాడు. సామాజిక స్పృహతో వ్యవహరిస్తే భవిష్యత్తు తరాలను కాపాడుకోవచ్చని, సేవా కార్యక్రమాలు చేయడం ద్వారా సమాజంలోని రుగ్మతలను రూపుమాపవచ్చనే దృఢసంకల్పంతో టీం సేవియర్స్ సభ్యులు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ఇంటర్ నుంచి బీటెక్, బీఏ, బీకాం, బీఎస్సీ వంటి డిగ్రీ కోర్సుల్లో చేరిన యువతీ యువకులు తప్పుదోవ పట్టడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఫీజులు చెల్లించాలని తల్లిదండ్రుల నుంచి డబ్బు తీసుకుని జల్సాలకు ఖర్చు చేసుకొంటుంటారు. కానీ పట్టణానికి చెందిన కొందరు విద్యార్థులు 'టీం సేవియర్స్' ద్వారా తమ వంతు సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు. తొలుత పట్టణంలోని ఆశానికేతన్‌లో ఉండే నిరుపేదలకు ఆహారం, దుస్తుల పంపిణీతో టీం సేవియర్స్ సేవా కార్యక్రమాలు మొదలయ్యాయి.



రక్తదానం చేస్తున్న టీం సేవియర్స్ (ఫైల్)

సంతృప్తిగా ఉంది



సమాజ సేవ కార్యక్రమాలను చేపట్టడం ద్వారా మంచి చేస్తున్నా మనే సంతృప్తి ఎంతో కలుగుతుంది. ఏదోక రకంగా మన చుట్టూ ఉండే వారికి అండగా ఉండాలన్నదే నా కోరిక. టీ సేవియర్స్ పేరుతో నేను, నా మిత్రులు కలిసి చేస్తున్న సేవా కార్యక్రమాలను నా తల్లిదండ్రులతో పాటు స్నేహితుల తల్లిదండ్రులు, బంధువులు ప్రోత్సహిస్తున్నారు.

– ఎస్ ప్రణీత్, టీం సేవియర్స్ వ్యవస్థాపకుడు

సేవియర్స్‌లో ఐదు వింగ్‌లు

• టీం సేవియర్స్‌లో అవేర్నెస్, మెడికల్, బ్లడ్, ఫుడ్, ప్రకృతి విపత్తులు అనే ఐదు వింగ్‌లు ఉండగా, ఒక్కో దానిలో 20 మంది చొప్పున సభ్యులుగా ఉన్నారు. అవేర్నెస్ వింగ్ సామాజిక అంశాల మీద అవగాహన సదస్సులు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యవంతం చేస్తుంది. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ఉమెన్ సేఫ్టీ, ఎంపవర్మెంట్, కెరియర్ గైడెన్స్, క్యారెక్టర్ బిల్డింగ్, తదితర అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తుంది. ఇప్పటి వరకు 300కు పైగా అవగాహన సదస్సులు నిర్వహించింది. అందులో భాగంగానే విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించి వారిలో సేవాభావం పెంపొందించేందుకు ఈ ఏడాది ఆగస్టు 15న నేతాజీ స్టూడెంట్ ఫెడరేషన్ అనే సంస్థను స్థాపించారు.


వైద్యం కోసం ఆర్థిక సాయం (ఫైల్)

• కావలికి చెందిన ప్రముఖ వైద్యురాలు డాక్టర్ నలిని పద్మ పర్యవేక్షణలో పనిచేసే మెడికల్ వింగ్ పేదలకు వైద్య చికిత్సకు ఆర్థిక సాయం అందజేస్తుంది. ఏదైనా కేసు వస్తే డాక్టర్ నలిని దృష్టికి తీసుకెళ్తే పరిశీలించి వైద్యచికిత్స, ఫండ్ రైజింగ్‌కు సిఫార్సు చేస్తారు. అలా ఇప్పటి వరకు 500 పైగా మెడికల్ కేసులకు అండగా నిలిచారు. మరో 120 మందికి రూ.50 లక్షల వరకు ఆర్థిక సాయం అందజేశారు.

• బ్లడ్ వింగ్ రక్తం కొరతను దృష్టిలో ఉంచుకుని రక్త శిబిరాలు నిర్వహిస్తుంది. ఎవరికైనా అత్యవసరంగా రక్తం అవసరమైతే బ్లడ్ వింగ్ సభ్యులను కాంటాక్ట్ చేస్తే వెంటనే స్పందించి దాతను సమకూర్చి అందజేస్తారు. అలా ఇప్పటి వరకు అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రెండు వేల మందికి పైగా రక్తదానం చేశారు. టీం సేవియర్స్ ఏర్పాటైన తరువాత ఏడేళ్లలో రెడ్‌క్రాస్ రక్తనిధికి మూడువేల యూనిట్ల రక్తాన్ని అందజేశారు. ఇందుకు గుర్తింపుగా 2022లో సేవియర్స్‌కు గవర్నర్ అవార్డు కూడా లభించింది. అలాగే ఏటా రక్తదానంలో జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలుస్తూ రెడ్‌క్రాస్ పురస్కారాలను సైతం టీం సేవియర్స్ అందుకుంటోంది.

– ఫుడ్ వింగ్ దాతల సహకారంతో అభాగ్యుల ఆకలిని తీరుస్తుంది. ఇప్పటి వరకు ఏడు వందలకుపైగా అన్నదాన కార్యక్రమాలను నిర్వహించింది. ఇక ప్రకృతి విపత్తుల వింగ్ అగ్నిప్రమాదాలు, వరదలు, కరోనా వంటి విపత్తుల సమయంలో స్పందించి బాధితులకు చేయూతనందిస్తుంది.


అభాగ్యులకు అన్నదానం (ఫైల్)


రక్తదాన శిబిరాల నిర్వహణకు గానూ గవర్నర్ పురస్కారాన్ని అందుకున్న ప్రణీత్ (ఫైల్)


జాతీయ పురస్కారం అందుకున్న ప్రణీత్ (ఫైల్)


విద్యార్థినులకు సామాజిక అంశాలపై అవగాహన (ఫైల్)

క్లుప్తంగా

పరమేశ్వరరావుకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం గుండెమడకల ప్రాథమిక పాఠశాల ఉపాధాయుడు యర్రా పరమేశ్వరావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు. నెల్లూరులోని రోటరీక్లబ్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఐపీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషారాణి చేతుల మీదుగా పురస్కారాన్ని ప్రదానం చేసి సత్కరించింది. యూటీఎఫ్ నాయకులు చెంచలబాబు, వీరాంజనేయులు, వెంకటేశ్వర్లు, బాలచెన్నయ్య, నరసింహులు, ప్రసాద్, మాల్యాద్రి, జగన్ పాల్గొన్నారు.

హెల్మెట్‌ను విధిగా ధరించాలి



సంగం: ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్‌ను ధరించాలని సంగం సీఐ వేమారెడ్డి సూచించారు. ఆదివారం రాత్రి ఆయన సంగం చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. పలువురు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం గమనించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

హైవే కూడళ్లలో రేడియం స్టిక్కర్ డ్రమ్‌ల ఏర్పాటు



మర్రిపాడు: మండల పరిధిలోని నెల్లూరు–ముంబయి జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు ఎస్సై శ్రీనివాసరావు చొరవ చూపారు. తన సొంత నిధులను వెచ్చించి డ్రమ్స్‌ను కొనుగోలు చేసి రేడియం స్టిక్కర్లను అంటించి కూడళ్లలో ఆదివారం ఏర్పాటు చేశారు. కూడళ్ల వద్ద వాహనాలు వేగంగా వెళ్లే క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకుంటుండడంతో రేడియం స్టిక్కర్లను అంటించిన డ్రమ్స్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

'మహాభారతం ప్రశ్నావళి' పుస్తకావిష్కరణ




కలిగిరి: తెల్లపాడు గ్రామానికి చెందిన మార్లెళ్ల శేషారెడ్డి రచించిన 'మహాభారతం ప్రశ్నావళి' అనే పుస్తకాన్ని తిరుమల తిరుపతి దేవస్థానంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలియుగ దైవమైన శ్రీవెంకటేశ్వరస్వామి సన్నిధిలో తాను రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించడం తన అదృష్టమన్నారు. ఈ అవకాశం కల్పించిన టీడీపీ అధికారులు, సిబ్బంది, తన గ్రామస్తులు, కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. శేషారెడ్డిని టీటీడీ అధికారులు ఘనంగా సత్కరించారు.

బోరు ఏర్పాటు



సీతారామపురం: పడమటి రొంపిదొడ్ల ఎస్సీ కాలనీలో తాగునీటి ఎద్దడి నివారణకు సర్పంచ్ పల్లె విజయమ్మ నూతన బోరును ఆదివారం ఏర్పాటు చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో నూతన బోరుతో పాటు మోటారును ఏర్పాటు చేయించి తాగునీటిని అందించారు. గత కొంతకాలంగా నెలకొన్న తాగునీటి ఎద్దడి సమస్యకు సర్పంచ్ పరిష్కారం చూపడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

పంటల సాగులో మెలకువలు పాటించాలి



ఉదయగిరి: రైతులు పంటల సాగులో మెలకువలను పాటించాలని ఉదయగిరి మేకపాటి గౌతంరెడ్డి వ్యవసాయ కళాశాల బోధన సిబ్బంది సూచించారు. ఆదివారం వారు గండిపాళెం, అప్పసముద్రం గ్రామాల్లో పర్యటించారు. రైతులకు సూచనలు, సలహాలు అందజేశారు. బత్తాయి, కూరగాయల సాగుపై అవగాహన కల్పించారు. వ్యవసాయకళాశాల బోధన సిబ్బంది గోపీకృష్ణ, నారాయణస్వామి, క్రాంతి కుమారి, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రత్యేక జిల్లా ఏర్పాటుతోనే ఉదయగిరి అభివృద్ధి

ఉదయగిరి: ప్రత్యేక జిల్లా ఏర్పాటుతోనే ఉదయగిరి ప్రాంత అభివృద్ధి సాధ్యమని ఉదయగిరి జిల్లా సాధన సమితి ముఖ్యనాయకుడు కే వేణుగోపాల్ తెలిపారు. 'ఉదయగిరి జిల్లా కావాలి' అనే కార్యక్రమాన్ని ఉదయగిరిలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలను సడలించి ఉదయగిరిని చిన్న జిల్లాగా ఏర్పాటు చేయాలన్నారు. అన్ని రాజకీయ పార్టీలు జిల్లా సాధనకు పట్టుపట్టాలన్నారు. త్వరలో జరిగే నియోజవర్గ స్థాయి సదస్సును విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ దస్తగిరి, ఖాదర్‌బాషా, గాజులపల్లి రామిరెడ్డి, గాజుల తాజుద్దీన్, ఒబుల్‌రెడ్డి, పరంధామిరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కే వేణుగోపాల్

వైద్యశిబిరానికి స్పందన



ఆత్మకూరు: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని షిర్డీ సాయిరాం కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జేవీవీ ఆధ్వర్యంలో ప్రతి రెండు నెలలకు ఒకసారి మొదటి ఆదివారం వైద్యశిబిరం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా నెల్లూరు మెడికవర్ ఆస్పత్రి డాక్టర్ బాలకృష్ణ రోగులకు బీపీ, షుగర్, గుండె, తదితర పరీక్షలు నిర్వహించి రెండు నెలలకు సరిపడా మందులను అతి తక్కువ ధరకే అందజేశారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు హరికృష్ణ, ఖాజారంతుల్లా, మున్సిపల్ మాజీ చైర్మన్ సందానీ, లక్కు ప్రసాద్, కృష్ణమోహన్, గంగాధర్, యూటీఎఫ్ నాయకులు శివప్రసాద్, రమేష్, సుధాకర్, డేవిడ్‌రాజు, వైద్య సిబ్బంది గీత, వెంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా దరఖాస్తుల స్వీకరణ

కలిగిరి: ప్రభుత్వం నూతన మద్యం పాలసీ ప్రకారం మద్యం షాపులకు ఈ నెల 9వ తేదీ వరకు పారదర్శకంగా దరఖాస్తులను స్వీకరిస్తున్నామని కలిగిరి ఎక్సైజ్ సీఐ మహమ్మద్ అబ్దుల్ జలీల్ ఆదివారం తెలిపారు. కలిగిరి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని కలిగిరి 3, వరికుంటపాడు 2, వింజమూరు 3, కొండాపురం 3 దుకాణాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ఈ నెల 11న నెల్లూరులో లాటరీ జరుగుతుందని తెలిపారు.

నేడు, రేపు శిక్షణా తరగతులు

ఆత్మకూరురూరల్: మండల పరిషత్ కార్యాలయంలో సోమ, మంగళవారాల్లో ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులకు రెండ్రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ కే శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. పంచాయతీల్లో పాలన, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాలు, ఆర్థిక నిర్వహణ, తదితర అంశాలపై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి పంచాయతీ నుంచి ఉపసర్పంచ్‌తో పాటు ఇద్దరు వార్డు సభ్యులు హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దుత్తలూరు: దుత్తలూరు టౌన్ 11కేవీ ఫీడర్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏఈ వెంకటసుబ్బయ్య ఆదివారం తెలిపారు. జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా కొత్త స్తంభాలు ఏర్పాటు చేస్తున్నందున ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాను నిలిపివేస్తున్నామని చెప్పారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఎంపీడీఓకు సన్మానం



సోమశిల: అనంతసాగరం మండల ఎంపీడీఓగా పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న ఏ మధుసూదన్‌రావును పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది ఆదివారం ఘనంగా సత్కరించారు. అలాగే బదిలీపై వెళ్తున్న సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు రమేష్‌బాబు, ప్రశాంతిని శాలువాలతో సత్కరించి వీడ్కోలు పలికారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఐదేళ్ల పాటు తనకు విధి నిర్వహణలో సహకరించిన ప్రతిఒక్కరికి పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు. విస్తరణాధికారి మస్తాన్, మండల విస్తరణాధికారి రమేష్, ఏపీఓ దయాసాగర్, టైపిస్ట్ శశికళాధరశర్మ, పంచాయతీ కార్యదర్శులు రమణరావు, తిరుపతయ్య, వెంకటేశ్వర్లు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ దోమలు

• మరమ్మతులకు గురైన ఫాగింగ్ యంత్రాలు
• పట్టించుకోని మున్సిపల్ అధికారులు
• నిద్రలేని రాత్రులు గడుపుతున్న ప్రజలు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్య లోపంతో దోమలు విజృంభిస్తున్నాయి. వాటి నియంత్రణకు చర్యలు చేపట్టాల్సిన మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫాగింగ్ యంత్రాలు మరమ్మతులకు గురయ్యాయని చెబుతూ తప్పించుకుంటున్నారు. కనీసం డ్రైనేజీల్లో బ్లీచింగ్ చల్లడం, మలాథియాన్ మందును కూడా పిచికారీ చేయడం లేదు. దీంతో పట్టణ ప్రజలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. మేజర్ పంచాయతీగా ఉన్న ఆత్మకూరు 2012లో మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది. ఆత్మకూరు చుట్టుపక్కల ఉన్న ఆరు గ్రామాలను కలిపి 23 వార్డులతో మున్సిపాలిటీని చేశారు. మున్సిపల్ పరిధిలో సుమారు 33వేల మందికిపైగా జనాభా నివాసం ఉంటున్నారు. పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, జేఆర్‌పేట ఎక్స్‌టెన్షన్,, ఎల్ఆర్‌పల్లి శివారు, టెంకాయతోపు, తూర్పువీధి కూడలి, రవితేజ కల్యాణ మండపం వెనుక, తదితర ప్రాంతాల్లో మురుగు నిల్వ ఉండి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి.

గతంలో విషజ్వరాలకు నలుగురు మృత్యువాత

గతంలో మున్సిపల్ పరిధిలో విషజ్వరాలు ప్రబలి నలుగురు మృత్యువాత పడ్డారు. మోడల్ ఎస్టీకాలనీలో ఓ బాలిక, ఎరుకలసానినగర్‌లో ఇద్దరు చిన్నారులు, జేఆర్‌పేటలో ఓ యువ ఇంజనీరు విషజ్వరాల బారిన పడి మృతి చెందారు. అదే సమయంలో ఎందరో విష జ్వరాలబారిన పడి ఆస్పత్రుల చుట్టూ తిరిగి లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టుకున్న ఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో విషజ్వరాలు అధికంగా వ్యాపిస్తున్నాయి. కేవలం దోమల వ్యాప్తితోనే జ్వరాలు అధికమవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.


బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఇళ్ల మధ్యలో మురుగు నిల్వ

చర్యలేవీ ?

దోమల నివారణకు ఫాగింగ్ చేసే యంత్రాలు మరమ్మతులకు గురయ్యాయి. ఫాగింగ్‌కు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాల్సిన మున్సిపల్ అధికారులు చేపట్టకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. డ్రైనేజీల్లో పూడికను తొలగించిన తరువాత దోమల నివారణకు మందులు పిచికారీ చేయడం, చెత్తపై బ్లీచింగ్ చల్లడం వంటివి చేయకపోవడం, వాటిపై పర్యవేక్షణ లేకపోవడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా అధికారులు పరిశీలించి దోమల నివారణకు సరైన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. కాగా ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్‌ను సంప్రదించగా ఫాగింగ్ యంత్రాలు రెండు మరమ్మతులకు గురయ్యాయని బాగుచేయించి రెండు రోజుల వ్యవధిలో ఫాగింగ్ చేయిస్తామన్నారు. కాలువల్లో పూడిక తొలగించి వెంటనే బ్లీచింగ్, దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తామని తెలిపారు.

ఫాగింగ్ యంత్రాలు ఏమయ్యాయి

మున్సిపల్ పరిధిలో దోమల నివారణకు రెండు ఫాగింగ్ యంత్రాలు ఉండేవి. ఇటీవల అవి కనిపించడంలేదు. దోమలు వ్యాప్తి చెందిన సమయంలో కూడా మందులు పిచికారీ చేయకుంటే ఇంకెప్పుడు చేస్తారు. ప్రజలు మరింత ఇబ్బందులు పడకముందే మున్సిపల్ అధికారులు, సిబ్బంది దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలి.

– షేక్ సందానీ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్

పాహిమాం..రక్షమాం



సంగం: నాణేలతో గంగమకు అలంకరణ
ఆత్మకూరులో వనదేవత అలంకారం



చేజర్ల: బోడిపాడులో విజయలక్ష్మి అలంకారం
కలిగిరి: తెల్లపాడులో సరస్వతిగా భద్రకాళి



ఆత్మకూరు: అన్నపూర్ణగా మహాలక్ష్మి
విశేషాలకారంలో పోలేరమ్మ, పోతురాజు

ఆత్మకూరు: శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని ఆలయాల్లో జగన్మాత ఆలయాల్లో విశేష పూజలను ఆదివారం నిర్వహించారు. అమ్మవారు వివిధ రూపాల్లో కొలువుదీరి భక్తులను కటాక్షించారు. ఆత్మకూరులోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో రాజరాజేశ్వరిదేవిగా, జ్వాలాముఖి ఆలయంలో లలితాదేవి, కాశీనాయన ఆశ్రమంలో వనదేవత, శివాలయంలోని అన్నపూర్ణాదేవి అమ్మవారు మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండలం మహిమలూరులోని పోలేరమ్మ, పోతురాజు ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దకాపు మెట్టుకూరు పద్మారెడ్డి పర్యవేక్షించారు.

సంగం: స్థానిక తిరుమనకొండపై ఉన్న రాజరాజేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి శ్రీచక్ర నవావరణ కుంకుమార్చన నిర్వహించారు. త్రివేణి సంగమం ఒడ్డున ఉన్న కామాక్షితాయి అమ్మవారు బాలాత్రిపురసుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. పాలేటి గంగమ్మ తల్లిని వివిధ రకాల నాణెలతో విశేషంగా అలంకరించారు. వంగల్లులోని భీమేశ్వరస్వామి ఆలయం, దువ్వూరులోని కోటేశ్వరస్వామి ఆలయాల్లో విశేషాలంకారాల్లో అమ్మవారు దర్శనమిచ్చారు.

సీతారామపురం: ఘటిక సిద్దేశ్వరం క్షేత్రంలో ఇష్టకామేశ్వరిదేవి, నారాయణప్పపేటలోని విజయ కనకదుర్గాదేవి అమ్మవార్లు లలితా త్రిపుర సుందరిదేవిగా, సీతారామపురంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు గజలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

సోమశిల: సోమశిలలోని సోమేశ్వరాలయంలో కామాక్షిదేవి అమ్మవారు లలితా త్రిపుర సుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

కలిగిరి: తెల్లపాడులోని భద్రకాళి ఆలయంలో పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారు సరస్వతిదేవిగా భక్తులను అనుగ్రహించారు.


వరికుంటపాడు : మండలంలోని తూర్పురొంపిదొడ్లలోని మానసాదేవి ఆలయంలో కూష్మాండ దుర్గ, వరికుంటపాడులోని సాయినాథుని ఆలయంలో కనకదుర్గమ్మ అమ్మవారు మహాలక్ష్మిదేవిగా, నాగార్పమ్మ ఆలయంలో సంతానలక్ష్మి అలంకారంలో అమ్మవారు భక్తులను కటాక్షించారు.

చేజర్ల: మండలంలోని బోడిపాడులోని మహాలక్ష్మి అమ్మవారు విజయలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా కుప్పా కొండారెడ్డి, రమణమ్మ దంపతులు వ్యవహరించారు.

బిట్రగుంట: బోగోలు మండలం విశ్వనాథరావుపేటలోని కోదండరామస్వామి ఆలయంలో రాజరాజేశ్వరి అమ్మవారు శ్రీలలితా త్రిపుర సుందరిగా భక్తులను అనుగ్రహించారు.



కూష్మాండదుర్గగా మానసాదేవి
వరికుంటపాడు: సంతాన లక్ష్మిగా నాగార్పమ్మ



సీతారామపురం: లలితా త్రిపుర సుందరిగా ఇష్టకామేశ్వరిదేవి
సంగం: బాలత్రిపుర సుందరిగా కామాక్షితాయి



సీతారామపురం: గజలక్ష్మిగా వాసవీ మాత
ఆత్మకూరు: లలితాదేవిగా జ్వాలాముఖి

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఆత్మకూరు: పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై ఎస్‌కే జిలానీ తెలిపారు. కోలగట్ల నుంచి ఆత్మకూరుకు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను వాశిలి అడ్డరోడ్డు వద్ద పట్టుకుని తనిఖీ చేయగా ఎలాంటి అనుమతి పత్రాలు లేవని చెప్పారు. దీంతో ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

కప్పరాళ్లతిప్పలో పడకేసిన పారిశుధ్యం



బిట్రగుంట: బోగోలు మేజర్ పంచాయతీ పరిధిలోని కప్పరాళ్లతిప్పలో పారిశుధ్యం పూర్తిగా పడకేసింది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఇళ్ల మధ్యే మురుగు ప్రవహిస్తోంది. ఈ కారణంగా పందులు, దోమలు స్వైరవిహారం చేస్తుండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. ఏటా నవంబర్, డిసెంబర్ మాసాల్లో తిప్పలో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నాయి. ముందగానే పారిశుధ్య పరిరక్షణపై దృష్టి సారించాల్సిన అధికారులు ఆ దిశగా కనీస చర్యలు చేపట్టడం లేదు. తిప్పకు కూతవేటు దూరంలోనే ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నా అధికారులకు మురుగు కనిపించకపోవడం గమనార్హం. ఇకనైనా అధికారులు స్పందించి వ్యాధులు ప్రబలక ముందే పారిశుధ్య చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.